క్లుప్తంగా

దర్గాకు తరలివచ్చిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి అధికంగా తరలివచ్చి స్వామికి భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిటకిటలడాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



జి.శ్రావణి

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని అక్షరశ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని జి. శ్రావణి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని కళాశాల డైరెక్టర్ మేఘనాథరెడ్డి ప్రిన్సిపాల్ రాఘవేంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి అండర్–19 జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. త్వరలో కర్ణాటక రాష్ట్రంలోని మాండ్య జిల్లాలో జరుగనున్న జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో రాష్ట్రం తరఫున శ్రావణి ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

శ్రీమఠంలో జిల్లా న్యాయమూర్తి



మంచాలమ్మ దర్శనం చేసుకుంటున్న జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు

మంత్రాలయం : ప్రముఖ రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్నూలు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు గురువారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలతో మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఆయనతోపాటు ఎస్‌ఐ వేణు గోపాల్‌రాజు ఉన్నారు.

నేడు పీడీ, పీఈటీలకు శిక్షణ

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు సంబంధించి ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయమ ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గురువారం సర్క్యులర్ విడుదల చేసింది. ఆదోని ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కంబిరెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి ఆదోని, గోనెగండ్ల, హొళగుంద, కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, ఎమ్మిగనూరు నుండి 70 మంది పీడీ, పీఈటీలు పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమంలో బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలపై శిక్షణ ఇవ్వనున్నారు. అయా పాఠశాలలకు చెందిన హెచ్ఎంలు వారిని రీలివ్ చేసి శిక్షణకు పంపాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

క్రాంతినగర్‌లో స్పందన

ఆదోనిటౌన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో గురువారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి నేతృత్వంలో 24వ వార్డు సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 23 మంది వినతి పత్రాలు అందజేశారు. ఇళ్ల పట్టాల కోసం 14 మంది, సక్రమంగా తాగునీటి సరఫరా చేయాలని ఒకరు, గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేయాలని ముగ్గురు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఇద్దరు, మురుగు కాలువలు మరమ్మతులు చేయాలని ముగ్గురు, ఇంటి పట్టాల కోసం 10 మంది దరఖాస్తులు అందజేశారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. టీపీఓ శ్రీనివాసులు, ఆర్‌ఓ అస్లాం, ఎంఈ రాధాకృష్ణ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం



బోరును ప్రారంభించిన దృశ్యం

కౌతాళం: పొదలకుంట గ్రామ ఎస్సీ కాలనీలో నెలకొన్న మంచినీటి ఎద్దడిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి నూతన బోర్ వేయించారని, దీంతో నీటి సమస్యకు పరిష్కారం లభించిందని గ్రామ నాయకులు మల్లయ్య, మంజునాథ తెలిపారు. కాలనీలోని వంద ఇళ్లకు ఈ నీటిని సరఫరా చేస్తామన్నారు. బోరు వేసిన అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో మోటారు ఏర్పాటు చేసి నీటి సరఫరాను గురువారం ప్రారంభించామని చెప్పారు.

పేదల సంక్షేమానికి బాసట

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



కోసిగి వైఎస్సార్ సర్కిల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి





సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం, వైఎస్సార్‌సీపీ జెండా విష్కరణలో పార్టీ నాయకులు

కోసిగి: పేదల సంక్షేమానికి బాసటగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచాడని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో సచివాలయం–1 కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ అధ్యక్షతన, జేసీఎస్ మండల కన్వీనర్ పి.మురళీ మోహన్ రెడ్డిలతో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు సీఎం కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ జెండాలతో ర్యాలీగా వైఎస్సార్ సర్కిల్ వరకు వెళ్లి అక్కడ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల అధ్యక్షుడుతో కలిసి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి గతంలో పథకాల అమలును నేడు అమలవుతున్న తీరులో తేడాను వివరించాలని చెప్పారు. ప్రతి గడప గడపకు వెళ్లి వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..

కౌతాళం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాయని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి, ఎంపీడీఓ సుబ్బారాజు అన్నారు. స్థానిక సచివాలయం–1లో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వల్ల ఎంత మంది లబ్ధిపొందారో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డును గ్రామ నాయకులతో కలసి ఆవిష్కరించారు. సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి, మాజీ సర్పంచ్ అవతారం, ఎంపీటీసీ అనిత, పీఏసీ చైర్మన్ వడ్డెరాము, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, నాయకులు రాజఅహమ్మద్, పంచాయతీ కార్యదర్శులు చెన్నయ్య, అంజనేయులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆదరిద్దాం

మంత్రాలయం : పేదల సంక్షేమ సారథిగా వర్ధిల్లుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరిద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జి.భీమారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సచివాలయం ఎదురుగా ముందుగా పార్టీ జెండా ఎగరవేశారు. కార్యాలయంలో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. అలాగే సచివాలయం పరిధిలోని ఇళ్లకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన పథకాలు, ప్రగతి వివరాలను గ్రామస్తులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని గుర్తు చేశారు. సచివాలయం పరిధిలో రూ.వంద కోట్ల వరకు సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం వెచ్చించారని వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యా, ఉప సర్పంచు పరమేష్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, మాజీ ఉప సర్పంచు గోరుకల్లు కృష్ణస్వామి, మాజీ ఎంపీటీసీ వెంకటేషెట్టి, నాయకులు శివకుమార్, రాఘన్నశెట్టి, భాస్కర్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక దేశంలో 17వ స్థానంలో ఉన్న ఆంధ్ర రాష్ట్రాన్ని 9 స్థానంలో నిలిపి దేశం నలమూలలా మనవైపు చూసేలా పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సచివాలయం – 1లో సర్పంచ్ రామాంజనేయులు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 97 శాతానికి పైగా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎం గెలిపించుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓఆర్డీ జనార్దన్, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



పెద్దకడబూరులో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షేమం, పరిపాలనాదక్షతకు దిక్సూచిగా జగనన్న



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన అధికారులు, నాయకులు

ఆదోనిటౌన్: సంక్షేమం, పరిపాలనాదక్షత, జీడీపీ రేటింగ్‌లో రాష్ట్రానికి మొదటిస్థానం సంపాదించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డు సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి' (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. మనోజ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న అమలు చేస్తున్న నాడు–నేడు పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకుందన్నారు. జగనన్న దిశ చట్టాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకొని శక్తి అనే చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ఇంటింటికీ రేషన్ డోర్ డెలివరీని ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్, కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, వలంటీర్, గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను కేరళ ప్రభుత్వం అమలు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. జగనన్న అమ్మఒడి స్ఫూర్తిగా తమిళనాడు ప్రభుత్వం ఆ రాష్ట్రంలో అమలుచేస్తుందని చెప్పారు. అలాగే రైతు భరోసా కేంద్రాల తరహాలోనే కేరళ ప్రభుత్వం ఈ విధానాలను అమలుపరిచేందుకు అధ్యయనం చేస్తోందని ఆ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలంటే సంక్షేమ పథకాలు, అభివృద్ధే ప్రజల ముంగిటకే విద్య, వైద్యం, ఆరోగ్యం అందించేందుకేనని ఆయన తెలియజేశారు. అంతకముందు సచివాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. జేఏసీ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, కౌన్సిలర్లు మహ్మద్‌స్వామి, మలేకర్ గోవిందు, ఇక్బాల్, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వైస్ చైర్మన్‌లు గౌస్, నరసింహులు, సన్ని, చిరంజీవి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యం



ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు అవసరం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోనిరూరల్: సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యపడిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆదోని మండలంలోని మండిగిరి గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంపీడీఓ గీతావాణితో కలిసి నిర్వహించారు. ఎమ్మెల్యే ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 225 గృహాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల అమలు, సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో ప్రతి ఇంటికి పథకాల ద్వారా రూ.3 లక్షల వరకు లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయ నిధుల ద్వారా రూ.21.80 లక్షలతో డ్రైయినేజీ కాలువలు, సీసీ రోడ్లు వేయించామని, 800 మంది ఇళ్ల పట్టాలు ఇచ్చామని వివరించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎంపీపీ పంపాపతి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్, బ్రాహ్మణ సంఘం నాయకులు మధుసూదనశర్మ, మాజీ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, నాయకులు ఉలిగప్ప, లక్ష్మిరెడ్డి, రాజు, రంగస్వామి, వీరారెడ్డి, కన్నా, నారాయణ, ఈరన్న, కార్తీక్, యేసేబు, దేవదాసు, రాజశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, హలిగేర వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ నాగరాజు, వీరశైవ లింగాయతీ రాష్ట్ర డైరెక్టర్ మంజుల, ఏపీ పోలీస్ హౌసింగ్ డైరెక్టర్ రేణుక, శ్రీలక్ష్మి, రామలింగేశ్వరయాదవ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలి..

అనంతరం మండిగిరిలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. నాలుగు సంవత్సరాల పరిపాలనలో జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం 95 శాతం పథకాలను అమలుచేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు.





డి.బెళగల్ సమీపంలో మిరప పంటలో నిలిచిన వర్షపు నీరు,కోసిగి వద్ద వేరుశనగ విత్తనం వేస్తున్న దృశ్యం

మంత్రాలయంలో భారీ వర్షం

మంత్రాలయం : అల్పపీడనంతో మంత్రాలయం నియోజకవర్గంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మంత్రాలయం మండలంలో భారీ వర్షం కురవగా..కోసిగి, పెద్దకడబూరు మండలాల్లో మోస్తరు వర్షం కుసింది. మంత్రాలయంలో 71.6 మీ.మీ, పెద్దకడబూరులో 23.4 మీ.మీ. కోసిగిలో 2.0, కౌతాళంలో 1.6 వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. మంత్రాలయం మండలంలో రాత్రి 10 గంటల నుంచి ఒంటి గంట వరకు వర్షం కురింది. మిరప, వరి పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. వాన రాకతో కొందరు రైతుల రబీ సీజన్ విత్తు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు.

కార్మికులు హక్కులను తెలుసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ

ఆదోనిరూరల్: అన్‌ఆర్గనైజ్డ్ సెక్టార్‌లో పనిచేసే కార్మికులు తమ హక్కులు తెలుసుకోవాలని జిల్లా అదనపు న్యాయమూర్తి పి.జె.సుధ అన్నారు. గురువారం కోర్టు ఆవరణలో జాతీయ న్యాయ సహాయ దినోత్సవం సందర్భంగా కార్మికులకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. వార్షికాదాయం రూ.3 లక్షల్లోపు ఉన్నవారందరూ మండల లీగల్ సర్వీస్ కమిటీలో నమోదు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమించుకోవచ్చని చెప్పారు. న్యాయవాదులు లోకేష్, సి.ఆనంద్, రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

తలనీలాలకు టెండర్ !

- కరోనా సాకు చూపి రెండేళ్ల పాటు తక్కువ ధరకు కైవసం
- మరో సారి తక్కువకే చేజిక్కించుకునే ప్రయత్నం
- నేడు ఉరుకుందలో తలనీలాల టెండరు

మంత్రాలయం/కౌతాళం: జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో తలనీలాల సేకరణ హక్కును తక్కువ ధరకే చేజిక్కించుకోవడానికి కొందరు కాంట్రాక్టర్లు రంగం సిద్ధం చేసుకున్నారు. గత మూడేళ్లగా కరోనా సాకు చూపి తక్కువ ధరకు చేజిక్కించున్నారు. ప్రస్తుతం కూడా తక్కువ ధరకే దక్కించుకునేలా ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఇందుకు ఆలయానికి చెందిన కొందరు అధికారులు పరోక్షంగా సహకారం అందిస్తున్నట్లు తెలిసింది. 2019–20లో తలనీలాల టెండరును రూ.1.90 కోట్లకు పలుకగా.. 2019జులై 1నుంచి 2020 జూన్ 30వరకు ఉండగా మార్చిలో కరోనా రావడంతో నవంబర్ వరకు అదే కాంట్రాక్టర్‌ను కొనసాగించారు. 2020–21 టెండరును నవంబర్‌లో నిర్వహించగా రూ. 1.45కోట్లకు పలికింది. దీనిని 2021 అక్టోబర్31 వరకు మాత్రమే కాలపరిమితి ఉండగా కరోనా సాకుతో నష్టం వాటిల్లిందని టెండర్‌దారుడు కమిషనర్‌కు విన్నపించుకోగా 2023 నవంబర్10 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం ఈనెల 10వ తేదీన తలనీలాల టెండరు నిర్వహిస్తున్నారు. గత నెల 30న నిర్వహించాల్సి ఉండగా వివిధ కారణాలతో వాయిదా వేశారు. 2010 నుంచి టెండర్లను పరిశీలిస్తే.. 2010–11లో రూ.90లక్షలు, 2011–12లో రూ.1.53కోట్లు, 2012–13లో రూ.1.82కోట్లు. 2013–14లో రూ. 2.07కోట్లు, 2014–15లో రూ.2.22కోట్లు, 2015–16లో రూ.2.55 కోట్లు, 2016–17లో రూ.1.77కోట్లు, 2017–18లో రూ.1.80కోట్లు, 2018–19లో రూ. 2.04కోట్లు, 2019–20 రూ.1.90 కోట్లకు పాటదారులు దక్కించుకున్నారు. ఇలా ఆదాయం తగ్గుతూ దేవాలయ ఆదాయానికి గండి పడింది. మూడు సంవత్సరాల నుంచి టెండర్ల ప్రక్రియ లేక పోవడంతో దేవాలయానికి సుమారు రూ. 1.50కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఈసారైన టెండర్లు పారదర్శకంగా నిర్వహించి ఆదాయం సమకురేలా అధికారులు చొరవ చూపాలని భక్తులు కోరుతున్నారు.

జయప్రదం చేయండి

కోసిగి : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయాలని కోసిగి గ్రంథాలయాధికారి దుల్లయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వారం పాటు విద్యార్థులకు ఆటల పోటీలు, పుస్తక పఠనం, వ్యాస రచన, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు అంశాలపై కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు పాల్గొన్నాలని కోరారు.

విజయవంతం చేయండి

పెద్దకడబూరు : ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకుడు ఎంపీ యువరాజ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సీ కళ్యాణమండపం ఆవరణలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నట్లు చెప్పారు. సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కోసిగి: జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ–2 నాగేశప్ప సూచించారు. గురువారం మండలంలోని సజ్జలగుడ్డం, ఐరన్‌గల్లు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. ఉపాధ్యాయులు వేళకు హాజరు కావాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం భోజనం రుచి చూశారు.

చేనేతలను ప్రోత్సహించాలి

ఆదోనిఅర్బన్: చేనేతలను ప్రభుత్వం ప్రోత్సహించాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ (ఏఐడబ్ల్యూఎఫ్) జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాద్, జాతీయ అధ్యక్షుడు చింతా శ్రీనివాస్ కోరారు. గురువారం సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కె.జి.వీరన్న గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నేత వస్త్రాలపై, ముడిసరుకులపై జీఎస్టీని రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థ ద్వారా చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని, చేనేత కార్మికులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, ఆదోని సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో నిలిచేలా జగనన్న పాలన



మహిళలకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి/మంత్రాలయం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచేలా పరిపాలన సాగిస్తున్నాడని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కోసిగి సచివాలయం–4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ పరిపాలన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95 శాతం అమలు చేసి నిరూపించాడన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందేలా చర్యలు చేపట్టాడని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే కావాలని సూచించారు. అనంతరం సచివాలయం –4 కార్యాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశమైయ్యారు. ప్రతి ఉద్యోగి బాధ్యతయుతంగా నడుచుకుంటూ ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, ఇల్లూరి ఆదినారాయణ, ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, సర్పంచ్ అయ్యమ్మ, మహంతేష్‌స్వామి, మాణిక్యరాజు,కోసిగయ్య, నాగరాజు, బుల్లి నరసింహులు, బండ్ల గోవిందు, మంగమ్మ, ఎంపీడీఓ రాజేంద ప్రసాద్, సీఐ ఎరిసా వలి, ఎస్ఐ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు



కొడలపేటలో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందని, సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే ఇంటింటికీ తిరుగుతున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో సమస్యలు పరిష్కారంగాక రాజకీయ నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదన్నారు. అయితే నేడు జగనన్న పాలనలో అలాంటి విధానాలకు స్వస్తి పలుకుతూ ఇంటి ముంగిటకే అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. గురువారం పట్టణంలోని 13వ వార్డు కార్వన్‌పేట, కొడల్‌పేట ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్ కృష్ణమోహన్‌తో కలిసి ఇంటింటికీ తిరిగి పథకాలు, లబ్ధి గురించి ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. అలాగే స్థానికులను అడిగి సమస్యలను వాటిని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, వార్డు సచివాలయాల అడ్మినేలు, వెల్ఫేర్, ఇంజినీరింగ్ సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లారు. వారు వాటి పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు మధు, చిన్నా, నరసింహులు, మాజీ మున్సిపల్ చైర్మన్ దేవదాస్, నాయకులు సన్ని, సింహం నాగేంద్ర, కారుమంచి శ్రీనివాసులు, వీరేష్, లక్ష్మి, వై.పి.లక్ష్మణ్, డీఈ నాయక్, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, కృపాకర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్నకు చెబుదాం'



మాట్లాడుతున్న తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి

కౌతాళం: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. గురువారం మండలంలోని ఏరిగేరి గ్రామంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ గోవిందు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. దీని వల్ల గ్రామాలకే మండల అధికారులు వచ్చి అర్జీలు స్వీకరించి సమస్యలకు పరిష్కారం చూపుతారన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమానికి కొందరు మండల అధికారులు గైర్హజరు కావడంపై ఎంపీడీఓ అసహనం వ్యక్తం చేశారు. వీరిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. ఎంఈఓ శోభరాణి, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, ఏఈ చెన్నయ్య, గ్రామ ఇన్‌చార్జి నీలకంఠ రెడ్డి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



జిల్లా ట్రెజరీ అధికారి బి.రామచంద్రరావును సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

ఆలూరు: విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని జిల్లా ట్రెజరీ అధికారి బి.రామచంద్రరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం ఆలూరు నియోజకవర్గ రిటైర్డు ఉద్యోగుల సంఘం యూనియన్ అధ్యక్షుడు రామకృష్ణ సమక్షంలో విశ్రాంత ఉద్యోగులు సమావేశమయ్యారు. జిల్లా ట్రెజరీ అధికారి బి.రామచంద్రరావు, జిల్లా ఎస్టీఓ అంజాద్‌బాషా, ఆలూరు ఎస్టీఓ శ్రీనివాసులు, సీసీ వేణుగోపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బి.రామచంద్రరావు మాట్లాడుతూ.. రిటైర్డు ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సకాలంలో అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పెన్షనర్లకు 1/1/2024 నుంచి 29/2/2024 మధ్య లైఫ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా మంజూరు చేయాలని, జీవన్ ప్రమాన్ యాప్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని, తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని పెన్షనర్లు అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ యూనియన్‌నాయకులు మురళీ స్వామి, పీఈటీ వీరభద్రగౌడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ట్రెజరీ అధికారి బి.రామచంద్రరావును పూలమాలలతో సన్మానించారు.